క్లుప్తంగా

సీపీఎం ధర్నా

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షల రుణం, పోడురైతులందరికీ హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కె.నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న అర్హులైన పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలను పోడు సాగుదారులకు పారదర్శకంగా పంపిణీ చేయాలని, లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల రుణం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లెనిన్ బాబు, సత్రపల్లి సాంబశివరావు, నరసింహారావు, లక్ష్మణరావు, రమేష్, శ్రీను, గౌరి, రాజగోపాల్, బీమయ్య, పద్మ, నాగమణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చర్ల: మండల కేంద్రంలోని విజయకాలనీకి చెందిన మీసాల ప్రభావతి బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడడంతో చికిత్స నిమిత్తం చిన్ననాటి స్నేహితులు ఆర్థిక చేయూతనందించారు. పేదరికంలో ఉన్న ఆమె కుటుంబం.. వారికున్న ఇంటిస్థలం సైతం అమ్మి వైద్య చేయించుకున్నప్పటికీ అవి సరిపోక దాతల కోసం ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో 1991వ సంవత్సరంతో పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థులు విషయం తెలుసుకుని సోమవారం రూ.66,800లను బాధితురాలికి అందించారు. సాయం అందించిన వారిలో పున్నం రామకృష్ణ, బత్తుల వెంకటేశ్వర్లు, యనమల హర్షవర్ధన్, బందా రమేష్, ఎడారి సత్యనారాయణ, కొంగూరు వెంకటేశ్వర్లు, వందే త్రీమూర్తులు, ముత్తారం శ్రీనివాసాచారి, గుమ్మల సత్యనారాయణ, దోమల రాజేశ్వరి, ఎడారి జయ, చింతూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచారం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ.. ఏఎంసీ కాలనీ, కేసీఆర్ కాలనీల్లో గడప గడపకూ కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించారు. జిల్లా కార్యదర్శి నిడదవోలు నాగబాబు, మండల అధ్యక్షుడు ములిసెట్టి రామ్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన వెంకన్న, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ములిసెట్టి నిఖిల్, మండల అధ్యక్షుడు అన్నం హరీష్, ప్రధాన కార్యదర్శి సాయి, మండల ఉపాధ్యక్షుడు సూరత్ సుదర్శన్ గడ్డం శ్రీహరి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గొర్రెముచ్చు జయరాజు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు వి.క్రాంతి బాబు, సీనియర్ నాయకులు ఆవుల సుబ్బారావు, మండల కార్యదర్శి కాసాని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కన్వీనర్ ఆగునూరి రాంబాబు, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చేయూత

దుమ్ముగూడెం: మండలంలో పెద్ద బండిరేవులోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు లయన్స్ క్లబ్ చేయూతనందించింది. సోమవారం బాధితులైన సోయం రాజమ్మ, సోయం సమ్మక్క కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, రూ.2 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ సీనియర్ సభ్యుడు యోగి సూర్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో భద్రాచలం క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, కార్యదర్శి గుండుశరత్, కోశాధికారి జి.భరత్ కుమార్, సభ్యులు బిల్లిపెల్లి రంగారెడ్డి, పంజా సునీల్ కాంత్, బొల్లి సూర్య చంద్రరావు, తాళ్లూరి ఆదినారాయణ, కోణాల జయరాజ్, స్థానిక పెద్దలు కారం పుల్లయ్య, ఎంపీటీసీ యలమంచి వంశీ, ఉప సర్పంచ్ వాగే ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన

బూర్గంపాడు: కోయగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నాలుగు సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులకు జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సర్పంచ్ తుపాకుల రామలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అన్ని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, జామ లక్ష్మి, సోము రోశిరెడ్డి, బెజ్జంకి కనకాచారి, రవి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

మణుగూరురూరల్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కేసీహెచ్‌పీ, రైల్వే సైడ్ ఏరియాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గురుమూర్తి, నాగేశ్వరరావు, శివరామకృష్ణ, శంకర్, టైసన్, వెంకటేశ్వర్లు, నాగరాజు, రజబలీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ చెయ్.. బిల్ తియ్..

- స్మార్ట్‌ఫోన్‌తోనే విద్యుత్ మీటర్ రీడింగ్
- ఒకే సమయంలో బిల్లింగ్, సర్వర్‌కు అప్‌లోడ్
- అధిక బిల్లుకు చెక్‌పడినట్లే..
- టెక్నాలజీని వినియోగించుకుంటున్న విద్యుత్ సంస్థ


కరెంట్ బిల్లును తీసే ప్రింటర్


ఆండ్రాయిడ్ మొబైల్‌లో యాప్ సాయంతో విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తున్న సిబ్బంది

భద్రాచలంఅర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతి కత వైపు విద్యుత్ శాఖ అడుగులు వేస్తోంది. ఆన్లైన్ పేమెంట్‌తో పాటు స్మార్ట్ ఫోన్‌లో యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానం అమల్లోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం అదే ఫోన్ ద్వారా మీటర్ను స్కాన్ చేయడం ద్వారా విద్యుత్ రీడింగ్ తీసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. సులువుగా సేవలందించేందుకు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఈ టెక్నాలజీని వినియోగించుకుంటోంది.

మొదటిగా ఈ పద్ధతిలో బిల్లింగ్ చేయడాన్ని గత సంవత్సరం నవంబర్‌లో కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. విజయవంతం అయిన తరువాత భద్రాచలం పట్టణంతోపాటు డివిజన్‌లోని గ్రామాల్లోనూ పూర్తి స్థాయిలో కొనసాగిస్తున్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలో డొమెస్టిక్ కనెక్షన్లు 20,695, కమర్షియల్ 4,389, ఇండస్ట్రీయల్ 110, పౌల్ట్రీ 11, వ్యవసాయం 36, గ్రామ పంచాయతీ వీధి దీపాలు 145, గ్రామ పంచాయతీ నీటి కనెక్షన్లు 11, పాఠశాలలు, దేవాలయాలు 145, తాత్కాలిక కనెక్షన్లు 36 ఇలా భద్రాచలంలో మొత్తంగా 25,578 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్ బిల్లింగ్‌తో వీరందరికీ సేవలు సులభతరమైనట్లు అయింది.

గతంలో పలు సమస్యలు..

గతంలో ఇంటింటికీ విద్యుత్ సిబ్బంది తిరిగి మీటర్ రీడింగ్ పుస్తకంలో రాసుకుని వారం తర్వాత వినియోగదారుడికి బిల్లు ఇచ్చేవారు. ఈ విధానంతో వినియోగదారులు, సంస్థకు ప్రయోజనకరంగా లేకపోవడంతో ఆ తరువాత స్పాట్ బిల్లింగ్ యంత్రాలను ప్రవేశ పెట్టింది. వీటి ద్వారా ఇంటి వద్దే బిల్లు తీసి ఇవ్వొచ్చు. అయితే ఈ యంత్రంలో బిల్లు నమోదైన అనంతరం దాన్ని కంప్యూటర్‌కు అనుసంధానించి సర్వర్‌లో అప్లోడ్ చేయాల్సి వచ్చేది. దీనికి రెండు, మూడు రోజుల సమయం పట్టేది. అప్‌లోడ్ సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని సర్వీస్లకు సంబంధించిన బిల్లుల హెచ్చుతగ్గులుగా నమోదు కావడం, ఇతర సమస్యలు ఏర్పడేవి. యంత్రాలు మరమ్మతులకు గురైతే రోజుల తరబడి సిబ్బంది రీడింగ్ తీసే పరిస్థితి ఉండేది కాదు.

స్మార్ట్ ఫోన్ రీడింగ్‌తో పరిష్కారం

స్పాట్ బిల్లింగ్ యంత్రాల్లోని లోపాలను అధిగమించేందుకు స్మార్ట్ ఫోన్‌తో విద్యుత్ మీటర్‌ను రీడ్ చేసే వ్యవస్థను తీసుకొచ్చారు. దీనికోసం మొబైల్ యాప్‌ను డెవలప్ చేసి టీఎస్ ఎన్‌పీడీసీఎల్ కార్యాలయానికి అనుసంధానం చేశారు. దీంతో బిల్లు తీసిన వెంటనే వినియోగదారుడి మీటర్ రీడింగ్, బిల్లు వివరాలు కార్యాలయానికి చేరుతాయి. వినియోగదారుడు ఎన్ని యూనిట్ల కరెంట్ వినియోగించాడు? ఎంత బిల్లు పెండింగ్‌లో ఉంది? యూనిట్‌కు ఎంత ధర? ఎప్పటివరకు బిల్లు చెల్లించాలి? అనే పూర్తి వివరాలతో ప్రింటర్ ద్వారా బిల్లు వెంటనే వస్తుంది. ఈ విధానంతో తక్కువ సమయంలో ఎక్కువ మంది వినియోగదారుల కరెంట్ బిల్లు తీసేందుకు అవకాశం ఏర్పడింది. పూర్తి వివరాలు తక్షణం అందులో నమోదవుతున్నాయి.

పారదర్శక వ్యవస్థ..

ఇంతకుముందు కాంట్రాక్ట్ ఉద్యోగులతో కరెంట్ బిల్లు తీయడం వల్ల వినియోగదారుడు వాడిన కరెంట్‌కు, బిల్లుకు కొన్నిసార్లు తేడాలుండేవి. వినియోదారుడు వాడిన యూనిట్ల వివరాలు సరిగా లేకపోవడంతో బిల్లు ఎక్కువ వచ్చిందని కస్టమర్లు అధికారులకు అడిగినా, వారు సరైన సమాధానం చెప్పలేక ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇదే అదునుగా కొన్నిసార్లు అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని కొందరి నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు మొబైల్ యాప్ ద్వారా అక్రమాలకు చెక్ పెట్టవచ్చు. వినియోగదారుడు వాడిన కరెంట్‌కు ఎలాంటి అవకతవకలు లేకుండా బిల్లు ఇవ్వవచ్చు. ఎంత కరెంట్ కాల్చితే అంతే బిల్లు పడుతుంది. సులువుగా వినియోగదారుడి వివరాలు కార్యాలయానికి చేరుతాయి. కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌తో వివరాలు నమోదవుతాయి. దీంతో ఏ రోజు ఎన్ని బిల్లులు తీశారో వెంటనే తెలిసిపోతుంది. వినియోదారుడికి చెప్పాల్సిన అవసరం లేకుండా పూర్తి వివరాలు క్షణాల్లో వస్తాయి. ఈ విధానంగా సులభతర, పారదర్శిక సేవలు దీనిద్వారా అందుతున్నాయి.

సౌకర్యవంతంగా బిల్లులు



మొబైల్ యాప్ ద్వారానే ప్రతినెలా బిల్లులు తీస్తున్నాం. దీనిద్వారా తక్కువ సమయంలో ఎక్కువ బిల్లులు తీయవచ్చు. పని మరింత సులువుగా చేయగలుగుతున్నాం. ఈ యాప్‌తో అక్రమాలకు చెక్ పెట్టడంతో పాటు వినియోగదారుడు వాడిన కరెంటు బిల్లు వస్తుంది. స్మార్ట్ ఫోన్లో తీసిన ప్రతి బిల్లు వివరాలు ప్రింట్లో వస్తాయి. ఈ విధానం సౌకర్యవంతంగా ఉండడంతో పాటు వినియోగదారులకు పారదర్శకమైన సేవలు అందుబాటులోకి తీసుకొస్తుంది. అవకతవకలకు ఆస్కారం ఉండదు.

– టి.వేణు, విద్యుత్ శాఖ ఏడీఈ, భద్రాచలం

పోడు భూములకు పట్టాలివ్వాలి


ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: దరఖాస్తు చేస్తున్న ప్రతి ఒక్కరి పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశించి ఎన్డీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గొనీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల తర్వాత కనీసం వాటి ఊసును ఎత్తే పరిస్థితి లేదన్నారు. భూములను సర్వేలు చేయించి, ఏడు లక్షల మందికే పట్టాలు ఇస్తామని ముందుగా చెప్పి, చివరిగా నాలుగు లక్షల మందికే ఇస్తామని తరువాత చెప్పడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ భద్రాచలం డివిజన్ నాయకులు జక్కుల రాంబాబు, ముసలి సతీష్, కొండపనేని సత్యనారాయణ, అజ్మీర మంగీలాల్, రమేష్, రవి, రామకృష్ణ, పెంటక్క, సమ్మక్క, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా దోమల మందు స్ప్రే

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలోగల కొత్త కావడిగుండ్ల, పాత కావడిగుండ్ల గ్రామాల్లో సోమవారం సర్పంచ్ కంగాల భూలక్ష్మి మొదటి విడత దోమల మందు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, తప్పనిసరిగా దోమల నివారణ మందు పిచకారీ చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో మొత్తం 306 గృహాలకు దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేశారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఎస్ పి.కృష్ణయ్య, కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది వెంకటేశ్వర్లు, రాధాబాయి, స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పఠనోత్సవం ప్రారంభం

దుమ్ముగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో జూన్ 26 నుంచి 31 జులై వరకు ప్రతిష్టాత్మకంగా తెలంగాణ విద్యాశాఖ ప్రవేశపెట్టిన పఠనోత్సవం కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల బండారుగూడెంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు ధారాళంగా చదవటం ఒక అలవాటుగా చేసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందించారు. దీనిలో భాగంగా ప్రతిరోజూ తరగతి గదిలో పుస్తకపఠనం కోసం ఒక పిరియడ్‌ను కేటాయిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయులు ఏజీజీ సీతారాం, టి.వంశీమోహన్, ఎం.సరోజిని, జి.రవి, ఆయా తిరుపతమ్మ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం చేయాలి

మణుగూరురూరల్: మణుగూరును జిల్లా కేంద్రంగా చేయాలని కోరుతూ నేనుసైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు భూక్యా ప్రసాద్ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మణుగూరు తహసీల్దార్ నాగరాజుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరులో మొబైల్ కోర్ట్ ఏర్పాటు చేయాలని, మణుగూరును మున్సిపాలిటీగా రద్దు చేసి ప్రజాభీష్టం మేరకు నూతన గ్రామపంచాయతీలు, నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. పినపాక నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, సమస్యలపై నిరసన తెలపడానికి ధర్నా చౌక్‌కు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మురుగు నీటి మళ్లింపు


మురుగు నీటిపై బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీలో పంచాయతీ సిబ్బంది మురుగు నీటిని మళ్లించి విస్తృతంగా బ్లీచింగ్ చల్లించారు. గడిచిన సోమవారం 'మెడికల్ కాలనీకి సుస్తి'అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు సదరు కాలనీలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహించకుండా, దుర్గంధం రాకుండా చర్యలు తీసుకున్నారు. వీలైనంత త్వరగా మెడికల్ కాలనీలో ఉన్న అసంపూర్తిగా ఉన్న రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను కూడా అధికారులు పరిష్కరించాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.

‘108’ను అందుబాటులో ఉంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

బూర్గంపాడు: బూర్గంపాడు మండల కేంద్రంలో 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి డిమాండ్ చేశారు. సోమవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా పెద్ద మండలమైన బూర్గంపాడులో 108 వాహనం లేకపోవటం బాధాకరమన్నారు.

తరచూ రోడ్డుప్రమాదాలు, రిఫరల్ కేసులు ఎక్కువగా ఉన్న మండలంలో 108 వాహనం లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మండల కేంద్రం బూర్గంపాడులో 108 వాహనం అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు భూక్యా సుగుణ,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మందా నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రసాద్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు

దమ్మపేట: మండలం పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ట్యాబ్‌లను ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ట్యాబ్‌ల పంపిణీతో ఉపాధ్యాయులకు పనిభారం తగ్గుతుందన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి సతీష్ కుమార్ ఉపాధ్యాయులకు ట్యాబ్‌లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ దారా మల్లికార్జునరావు, జిల్లా టెక్నికల్ అసిస్టెంట్ బి.మోహన్, ఎంఈఓ లక్ష్మి, అశ్వారావుపేట ఎంఈఓ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల వితరణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్‌ఏయూపీ (రంగనాయకుల గుట్ట) పాఠశాలలో 1984లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 50 మందికి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిరిపురపు రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మిత్రులు బండారు సత్యం, అభినేని శ్రీనివాసరావు, రవి, ముప్వ రమ, బ్రహ్మదేవర ఉదయలక్ష్మి తదితర మిత్రుల సహాయ సహకారాలతో 40 సంవత్సరాల వివిధ వృత్తుల్లో జీవిస్తున్న మిత్రులందరినీ ఒకటిగా చేసి గత సంవత్సరం గెట్ టుగెదర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో అభినేని శ్రీనివాసరావు, చింతం వెంకటేశ్వరరావు, జెమిలి శ్రీనివాసరావు, చీపురు శ్రీనివాసరావు, జొన్నాడ నాగేశ్వరరావు, జీవీవీఎస్ స్వామి, భారతి, యశోద, సుజాత, విజయ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

అశ్వారావుపేటరూరల్: పెన్షనర్లకు సంబంధించిన సమస్యలు, డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ లూథర్ విల్సన్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెన్షనర్ల మూల పెన్షన్ నుంచి ఒక శాతాన్ని మినహాయించి, పూర్తి స్థాయిలో ఉచిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఆర్‌లను వెంటనే అమలు చేయాలని, మధ్యంతరభృతి చెల్లించాలని కోరారు. ప్రతి నెలా మొదటి తేదీన పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్న అందించిన వారిలో పిల్ల పుల్లయ్య, రాజు ఉన్నారు.

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సంఘం భద్రాచలం శాఖ వారు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి, సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాలకు పంపించారు. ఈ సందర్భంగా సంఘం భద్రాచలం అధ్యక్షుడు భూషణరావు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని, పెన్షనర్ల నుంచి మ్యూటేషన్ ద్వారా పొందిన మొత్తం 12 సంవత్సరాలే తీసుకోవాలని కోరారు. పీఆర్సీని నియమించి, ఐఆర్, డీఆర్లు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.వెంకన్న, ఎస్.మునుమంతరావు, మాణిక్య కుమారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని 12 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రం శుభ్రపరచడం, నిర్వహణ కారణంగా ఈ కేంద్రం పరిధిలోని ఆయా కాలనీల్లో నేడు ఉదయం గంటల 6.30ల నుంచి 30 నిమిషాలు మాత్రమే తాగు నీరు సరఫరా అవుతుందని భద్రాచలం మిషన్ భగీరథ ఉప కార్యనిర్వాహక ఇంజనీరు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

చెక్కుల పంపిణీ

బూర్గంపాడు: అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత పంపిణీ చేశారు. సోమవారం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన డి.హుస్సేన్, వై.రాణిలకు చెక్కులను ఆమె అందించారు. ఉపసర్పంచ్ యడమకంటి ఝాన్సీలక్ష్మి, మేడగం శ్రీనివాసరెడ్డి, మొండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ఇమడాబత్తుని రామకృష్ణ, అజ్మీరా వసంత, జయరాజ్ పాల్గొన్నారు.

భవనానికి శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి సర్పంచ్ కాకా అశోక్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేష్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అరెస్టులు బాధాకరం

అశ్వాపురం: టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాష్, నాయకుడు తుళ్లూరి రమేష్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేయడం బాధాకరమని ఎంపీటీసీ తుళ్లూరి గంగాభవాని అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆమె డిమాండ్ చేశారు.

రైతుకు విత్తన సాయం

గుండాల: గత ఏడాది అగ్ని ప్రమాదంతో మొక్కజొన్న చేనును కోల్పోయిన గుండాల మండలం జగ్గయ్యగూడెం గ్రామానికి చెందిన రైతు తోలెం సమ్మయ్యకు ఈ ఏడాది పంటకు కావాల్సిన 15 మొక్కజొన్న విత్తనాల ప్యాకెట్లను వ్యాపారవేత్త మానాల వెంకటేశ్వర్లు సహాయంగా అందించారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. మానాల ప్రణీత్, ఇల్లెందుల అప్పారావు, రైతు సమ్మయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు.

పొంగులేటి ప్రకటనతో సంబురాలు

అశ్వాపురం: ఢిల్లీలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో జులై 2న చేరనున్నట్లు ప్రకటించడంపై మండల కేంద్రంలో ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పొంగులేటి శ్రీనన్న సైన్యం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దిబ్బగూడెం గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో విద్యుత్ వైరు తెగి పడి ఉండగా, అదే సమయంలో మేత కోసం వెళ్లిన అచ్యుతాపురం గ్రామ నివాసి రాచూరి నాగుకు చెందిన సూడి గేదె విద్యుత్ షాక్‌కు గురైంది. అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని, బాధిత రైతు వాపోతున్నాడు.

ఆవుకు గాయాలు..

దుమ్ముగూడెం: మండలంలోని అచ్యుతాపురం గ్రామ శివారులో ఓ ఆవు విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలైంది. గ్రామంలో సోంది చిట్టమ్మ ఇంటి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ పాయింట్‌కు సోమవారం విద్యుత్ సరఫరా అయింది. దీంతో అటుగా మేతకు వెళ్లిన ఓ ఆవుకు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైంది.

కిందపడి కొట్టుకుంటుండగా గ్రామస్తులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసి సరఫరాను నిలిపివేయడంతో ఆవు గాయాలతో బయటపడింది. ఇటీవల కురిసిన వర్షానికి ఎర్త్ పాయింట్‌కు విద్యుత్ సరఫరా అయినట్లు తెలుస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు మరోసారి ఇటువంటి ఘటన జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం


అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఎక్సైజ్, పోలీస్, వైద్య శాఖలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు మాట్లాడుతూ.. చెడు వ్యాసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రాణాంతకమైన మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువత జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా పయనించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఆయా శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ములకలపల్లి: కమలాపురంలో మాట్లాడుతున్న సీఐ వినయ్‌కుమార్


అన్నపురెడ్డిపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


దమ్మపేట: గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


కరకగూడెం: నీలాద్రిపేట వలస ఆదివాసీలతో మాట్లాడుతున్న ఎస్సై రాజారామ్